కథ

# కొయ్యబొమ్మలు

**వేంపల్లి గంగాధర్**

“చూడు మునిస్వామి! నిన్ను రెండ్రోజులు లాకప్‌లో పెట్టినందుకు నాక్కూడా బాధగానే వుంది. ఏం చెయ్యమంటావో నువ్వే చెప్పు...ఈమధ్యనే పి.డి.యాక్ట్ అనేది వొకటొచ్చింది. దీని క్రింద అరెస్ట్ అయినోళ్లకు బెయిల్ రావాలంటే కూడా ఆరు నెలలు పడుతుంది. ఇంకైనా జాగ్రత్తగా వుండండి. ఈ సంగతి మీ పల్లెల్లో వాళ్లకందరికి చెప్పు” పోలీస్ స్టేషన్‌లో కాలుమీద కాలేసుకుని బూట్లు ఆడిస్తా, కళ్లు ఎగరేస్తా చెప్పినాడు ఎస్సై.

చేతులు కట్టుకొని మాసిన బట్టల్తో విచారం నిండిన ముఖంతో నిలబడి వున్నాడు మునిస్వామి..ఎదురుగా.

“మరీ బతకలేకపోతే ఒక పని చెయ్యండయ్యా..ఎక్కడో ఒకచోట రోడ్డు ప్రక్క రెండు గుంజలు పాతి మధ్యలో తాడుకట్టి నీ కూతుర్నో కొడుకునో పైకెక్కించి దొమ్మరి ఆటనే ఆడుకోండి, డబ్బు వస్తుంది. ఈ కొయ్య బొమ్మల పని చేసి జైళ్లల్లో పడేదానికంటే అదే మేలు కదా..ఏమంటావ్” ఎడమ చేత్తో మీసాన్ని దువ్వుకున్నాడు ఎస్సై.

తనని కులం పేరుతో దూషిస్తున్న ఎస్సై పట్ల పట్టరాని ఆగ్రహం వస్తోంది కానీ ఏం చేయగలడు?

తిరగబడలేని బలహీన బతుకులు.

మౌనంగా నిలబడిపోయాడు...బొమ్మలా.. కొయ్య బొమ్మలా..మునిస్వామి!

నరాల్లో నెత్తురు రగులుతాంది. కానీ చేతకానితనం. కళ్లు మూసుకున్నాడు.

కన్నీళ్లు పొంగుకొచ్చాయి.

కళ్లముందు రకరకాల బొమ్మలు కన్పిస్తా వుండాయి.

దేవుళ్లు... దేవతుల... వేంకటేశ్వరుడు, వినాయకుడు, కృష్ణుడు, మహావిష్ణువు, హనుమంతుడు, శివపార్వతులు, దశావతారాలు, లక్ష్మీసరస్వతులు..ప్రత్యక్షమౌతున్నారు.

వీళ్లనందర్నీ తాను ఎందుకు తయారు చేయాలి?

ఎందుకు జైల్లో పడాలి?

రెండ్రోజులు లాకప్ జీవితం గుర్తుకొచ్చింది.

కడుపులో తిప్పినట్లు అయ్యింది. తానెప్పుడు స్టేషన్ ముఖం కూడా చూసింది లేదు. అలాంటిది కటకటాల వెనుక రెండ్రోజులు గడపాల్సి వచ్చింది.

తనపట్ల, తను నమ్ముకున్న కళపట్ల అసహ్యమేస్తోంది.

తనని ఏ దేవుడూ కనికరించలేదెందుకు?

రకరకాల ఆలోచనలు పరిభ్రమిస్తున్నాయి.

ooo

“మాంఛి బేరం తగిలింది..మద్రాస్‌నుంచి వ్యాపారి వచ్చాడు..చూడు..ఆర్డర్ తీసుకో. నువ్వు బాగా బొమ్మలు చేస్తావు కాబట్టి నీ దగ్గరికే పిలుచుకొచ్చినా” మునిస్వామిని పక్కకు తీసుకొచ్చి చిన్నగా చెవిలో చెప్పాడు వైకుంఠం.

“ఎంతిస్తాడంటా?” ప్రశ్నించాడు మునిస్వామి.

“ముప్పై వేల రూపాయలు...వినాయకుడి బొమ్మ కావాలట” చెప్పాడు వైకుంఠం.

కళ్ళముందు కాసుల వర్షం కదలాడింది.

కానీ.. కొయ్య ఎక్కడ్నుంచి వస్తుంది? ఆ ప్రశ్న ఆలోచనల్లోకి రాగానే నిరాశ ఆవహించింది.

“సరిపోదంటే చెప్పు..ఇంకో మూడువేలు ఖర్చుల కోసం మాట్లాడి ఇప్పిస్తాలే” బేరం పోగొట్టుకోవద్దు, నా కమీషన్ మరచిపోవద్దు అనే ధోరణిలో చెప్పాడు వైకుంఠం

ఇంటి బయట వేపచెట్టు నీడలో..తెల్లటి కారులో వ్యాపారి ఉన్నాడు.

బేరం ఏదో ఒక విధంగా కుదిరితే అడ్వాన్సు కూడా అందుతుంది.

“సరే..నేను బొమ్మ చేసి ఇస్తాను” అని చెప్పడానికి ధైర్యం చాలడం లేదు మునిస్వామికి.

ఫారెస్టోళ్ళ జీపుశబ్దమే చెవుల్లో ప్రతిధ్వనిస్తా వుంది. ఎప్పుడొచ్చి ఇళ్ల మీదపడి సోదాలు చేస్తారోనని పల్లెలోని పనోళ్లందరూ ఆందోళన పడ్తావుండారు. ఇట్లాటి పరిస్థితుల్లో కొత్త పనులు ఎవరు ఎంతిస్తే మాత్రం ఒప్పుకుంటారు? కానీ తనకు తప్పదు.

“ముందే చెప్తా వుండాను మునిస్వామి..సిసలైన ఎర్రచందనం బొమ్మే కావాల..తేడా వస్తే బాగుండదు..కన్నమర్ల దగ్గర నమ్మకం పోతే ఇద్దరి బిజినెస్‌లకూ ఇబ్బందే” హెచ్చరిస్తా చెప్పినాడు వైకుంఠం.

తలాడించినాడు మునిస్వామి.

ఆ తర్వాత అడ్వాన్సు, కొంత చేతికందింది.

మూడు నెలల గడువు కోరాడు మునిస్వామి. ఒప్పుకున్నాడు వైకుంఠం. కారు కదిలింది మట్టిదారెంబడి ఎర్రదుమ్ము రేపుకుంటా.

అంతా బాగానే వుంది మరి కొయ్య ఎలా?

“రేయ్.. నాగులు, మంచి ఎర్రచందనం కొయ్య కావాల, మామూలుగా ఇచ్చేదానికంటే రెండువేలు ఎక్కువే తీసుకో, తెచ్చిస్తావా?” పల్లెకు దిగదాల గొల్లపల్లెకు ఆనుకొని వుండే కొట్టాల దగ్గర నాగులును కలిసి తన ప్రతిపాదనను పెట్టాడు మునిస్వామి రహస్యంగా!

వాడు వెంటనే చొక్కా విప్పాడు.

వెనక్కి తిరిగి వీపు చూపించినాడు. వాతలు మాయని మచ్చలలాగా కన్పిస్తా వుండాయి.

“రెండు నెళ్ల క్రితం లోపలేసి కొట్టినారు..సామీ జూడు ఎట్టా పెరక్కచ్చినాయో వాతలు. ముందే టౌనుకు కొత్త ఫారెస్టాఫీసరొచ్చినాడని అందరూ అనుకుంటా వుండారు. నా చేత కాదు. నన్ను విడ్సిపెట్టి మీ పని మీరు జూసుకోండి” అని నాగులు రెండు చేతులెత్తి దండం పెట్టినాడు.

వాడలా దండం పెట్టిన తర్వాత ఎప్పటిలాగానే మిలట్రీ మందు వాడి చేతుల్లో పెట్టడం మునిస్వామికి అలవాటే.


వాడు కూడా ఎప్పటిలాగానే “వద్దు..వద్దు.. మందు మానేసినా”నంటూనే చేతులు రుద్దుకుంటా తీసుకున్నాడు పెదవులు తడి చేసుకుంటా.

మునిస్వామి ఊపిరి పీల్చుకున్నాడు.

నాగులు మందు బిగించి గొడ్డలి చేతబట్టి తూరుపు శేషాచలం కొండలకేసి బయలేదేరినాడంటే రెండ్రోజుల్లో కొయ్య వచ్చి కోత మిషను కాడికి చేరినట్లే లెఖ్క.

వాని లెఖ్క తప్పదు. వానికిచ్చే లెఖ్క తగ్గితే వాడు తగ్గడు. అంతా గొడ్డలి పదును వ్యవహారం! అందుకే వానితో ఎంతవరకో అంతవరకే. అంతకు మించి పెట్టుకోరు. కొండలో ఎర్రచందనం చెట్లను కొట్టడంలో

**ఆంధ్రభూమి దినపత్రిక ఉగాది కథలపోటీలో ఎంపికైన రచన**



వాడు

మహాఘనుడు. ఎమ్మెల్యే తమ్ముడు ఎఱ్ఱ చందనం వ్యాపారం చేసేటప్పుడు రాత్రిపగలూ అడవిలోనే వుండి మాన్లు కొట్టుకొని వాసాలను భుజంపైన పెట్టుకొని కిందకు మోసుకొని వచ్చేవాడు. అట్లా ఎఱ్ఱ బంగారు చందనాన్ని స్మగ్లింగ్ చేయడంలో నాగులుకు ఎంతో అనుభవం వుంది. మద్రాసులో పోలీసోళ్ళు ఎన్నోసార్లు పట్టుకొని లోపలేస్తే ఎమ్మెల్యే తమ్ముడే విడిపించేవాడు. లారీలకు లారీల లోడును కూలోళ్లను పెట్టి అడవిలో కొట్టిస్తా వుండేటోళ్ళు. సగం చెట్లు ఎమ్మెల్యే ఖాతాలో చేరితే మరో సగం ఎంపీ బామ్మర్ది ఖాతాలో చేరినాయి. ఫలితంగా అడవి ఖాళీ అయ్యే పరిస్థితి ఏర్పడింది.

ఎఱ్ఱ చందనం స్మగ్లింగ్ లాభసాటి వ్యాపారం అయ్యింది. కానీ బొమ్మల్ని తయారు చేసుకోవడానికి శెట్టిపల్లె కళాకారులు తనకలాడతా వుండారు కొయ్య దొరకక!

అడవికానుకొని వుంటారు. అక్కడే పుట్టారు. అక్కడే పెరిగారు. అక్కడే జీవిస్తా వుండారు. అడవి తల్లిని నమ్ముకొనే బతకుతావుండారు. మరి అడవి నుంచి వారిని వేరు చేస్తున్నదెవరు? వారి వనరులు వారికెందుకందడం లేదు?

○○○

శేషాచలం ఎగువ కొండలు.. తూర్పుదిశగా..ఆకాశం కింద పచ్చటి పందిర్లు వేసినట్లు విస్తరించి వున్నాయి. తొలిజాము ఎండపడి అడవంతా తళతళా మెరుస్తా వుంది. నునుపుతేలి ఆకాశాన్ని చుంబించే కొమ్మలతో ఎత్తుగా ఎదిగి పసుపురంగు పూలతో నిండుగా విప్పారి దీటుగా నిలబడిన ఎఱ్ఱచందనం చెట్లు పడమటి గాలికి అగి అగి ఊగుతున్నాయి. నన్నని మద్దిచెట్లు, ఆకురాలిపోతున్న తపసి చెట్లూ గుసగుసలాడుకుంటున్నాయి. గడ్డిపోచల మధ్య నుంచి ఏదో జంతువు కదలి వెళ్ళిపోయింది. చెట్లపైన కొండముచ్చులు అటు ఇటు ఎగురుతున్నాయి. కొండరాళ్ళ మధ్య పుట్టిన జల ఊట సవ్వడి చేసుకుంటా అటు పక్కన్నుంచి జాలువారుతోంది. ప్రశాంతమైన అడవి ప్రపంచంలోకి అడుగుపెట్టాడు నాగులు..

గొడ్డలితో తిరుగుతున్నాడు..తనకు ముని స్వామి చెప్పిన కొలతలుగల చెట్టు కోసం వెతుకు

తున్నాడు. అలసిపోయిన నల్లటి ముఖమంతా అశాంతిగా వుంది.

కాసేపటి తర్వాత ఒక నిర్ణయానికి వచ్చాడు.

ఒక చెట్టు దగ్గర ఆగాడు..పైకి చూస్తూ.

అరచేత్తో చెట్టు మొదలును కొట్టి చూశాడు నేర్పుగా నీళ్లలోకి దిగేముందు ఈతగాడు నీళ్ళను పరీక్షించినట్లు. సంతృప్తిపడ్డాడు.

వేటు..మొదటి వేటు పడింది...అడవంతా అదిరింది.

చెట్లమీది పక్షులు బెదిరి ఎగిరాయి.

కొమ్మల్లో అల్లుకున్న గూళ్ళు కొన్ని కిందపడ్డాయి. పూలు రాలిపోతున్నాయి..కొమ్మలు రివ్వున ఊగుతూ పెనుగులాడుతున్నాయి..

వేటు..వేటు తర్వాత వేటు.. శక్తికొద్దీ పడుతూనే ఉన్నాయి. ముక్కలు ముక్కలుగా చెట్టు విచ్ఛిన్నం. కాసేపు కొట్టిన తర్వాత ప్లాస్టిక్ బాటిల్‌లోని నీళ్ళు తాగాడు నాగులు విరామంగా.

బండరాయికేసి గొడ్డలి పదును చేసుకొని మళ్ళీ కొట్టడం మొదలుపెట్టాడు.

ఆ పని అలా కొనసాగుతూనే వుంది.

అప్పుడప్పుడు పని ఆపి ఫారెస్టోళ్ళు ఎవరైనా వస్తున్నారేమోనని బెదురుచూపులు చూస్తా వుండాడు.

కొండలో పులి వుందని ఎవరో చెప్పిన మాట గుర్తుకొచ్చినప్పుడు సన్నటి అలజడి...అరికాళ్ల కింద.

ఏదైనా అలికిడి అయితే భయపెట్టే అలజడి.. ఆందోళన.. అలాగే గొడ్డలి వేటును దించుతోంది. చెట్టులోకి దిగుతోంది.

వాడు తాగిన మందు వాసన గుప్పుమంటోంది.

చమటతో నల్లటి శరీరం మెరిసిపోతోంది.

గస..గస.. నుదుటి చమట తుడుచుకుంటూనే వాడు శ్రమిస్తున్నాడు. భయంకరంగా తలపడుతున్నాడు.

'చెట్టు కూల్చడం' వాడి లక్ష్యం.

ఒక సుదీర్ఘ పోరాటం తర్వాత వాడి ఆరాటం తీరింది.

అడవంతా ఉలిక్కిపడేలా.. పెద్ద శబ్దం చేస్తూ...

వీడ్కోలు పలుకుతూ.. తనలోకం నుంచి వేరవుతూ చెట్టు నేలకూలింది.

నాగులు ముఖంలో కొత్త ఆనందపు వెలుగు.

ooo

వారం రోజులు తర్వాత కొయ్య, కోత మిషను దగ్గరికి చేరింది. మునిస్వామి అక్కడికే వచ్చినాడు.

"సామీ.. దేవుని సాచ్చిగా చెప్తావుండాను. దీన్ని కొట్టడం ఒక పనైతే.. కిందకు తీసుకురాను రెండురోజులు పట్టింది. ఫారెస్టోళ్ళ కళ్లలో యాడ పడ్తాదోనని చెప్పి ఎంతసావు సచ్చినానో..కలీ పొదళ్ళ దాచిపెట్టి నేను మా తమ్ముడు గంగులన్న ఇద్దరం రాత్రిళ్ళు మోసుకొని వచ్చినాం. దిగదాల కొచ్చేటప్పుడు మావాడ్ని నాగుపాము గూడా కాటువేస్తా వుండ్యా.. ఇదే ఆఖరి సామీ. ఇంగెప్పుడూ ఎర్ర కొయ్య కోసం కొండకు పోను.. ఇంగో వెయ్యి ఎక్కువీయాల్సిందే" తన కష్టాలన్నీ చెప్పుకొచ్చినాడు నాగులు.

కొయ్యను చూసినాడు మునిస్వామి దగ్గరికెళ్ళి. 'మొదటిరకం కొయ్యనే' సంతృప్తిపడినాడు. జేబులోంచి డబ్బు తీసి లెక్క చూసి యిచ్చినాడు.

"యింగో ఐదునూర్లు..ఇయ్యిసామీ" బతిమలాడుతూ అడిగినాడు నాగులు.

"రేపు ఇంటికాడికి రా. తీసుకపోదువు" తప్పించకోవడానికి వీలుకాక చెప్పినాడు మునిస్వామి.

వాడు తలాడించి వెళ్లిపోయాడు.

కోత మిషనులో పని మొదలయ్యింది. పొట్టు రేగుతా వుంది శబ్దం. ముళ్ల చక్రం గిర్రున తిరుగుతా వుంది. కొయ్య ఒక రూపాన్ని సంతరించుకుంటా వుంది. నల్లటి చర్మం రాలిపోతూ వుంటే ఎర్రటి కొయ్య బయటికొస్తా వుంది కుబుసం విడుస్తున్న పాములా. కోత మిషను నుంచి కొయ్య ఇంటి వసారాలోకి చేరింది. యిక అసలు పని మొదలయ్యేది ఇక్కడే. మునిస్వామి భార్య బంగారమ్మ శుక్రవారం నాడు కొయ్యకు పసుపు కుంకాలతో పూజ చేసింది. వర్జ్యం పోయినాక చేతిలోకి ఉలి తీసుకున్నాడు. మనసులోనే దేవుడికి దండంపెట్టుకుంటా. తనకిష్టమైన పని. తను నమ్ము

## సెలీనా పట్టుదల

*ఇటీవల పూజాబేడీ ఓ (అ)సందర్భంలో సెలీనా జైట్లీని మానసిక రోగంతో బాధపడుతోంది అని కామెంట్ చేయడంతో వెంటనే సెలీనా- పూజాబేడీ మీద పరువు నష్టం దావా వేసింది. ఆమె గనక తన కామెంట్స్‌ని విత్‌డ్రా చేసుకుని పత్రికలు, ఇతర మీడియా ద్వారా తనకి క్షమాపణ చెప్పినట్టయితే తను కేసు వాపసు తీసుకుంటానంటోంది సెలీనా. మరి పూజాబేడీ అలా చేస్తుందా లేదా అని బాలీవుడ్ జనాలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.*



కున్న వృత్తి. తండ్రి బాధ్యతగా నేర్పించిన విద్య. బతుకు తెరువును చూపిస్తున్న బొమ్మల కళ. కొయ్యలో రూపం కన్పిస్తావుంది. దేవుడు.. వినాయకుడి రూపం కొయ్యలో పల జీవం పోసుకుంటా వుంది. అవసరమైన భాగాలు మిగిలిపోతూ వుంటే అనవసరమైన భాగలు కొయ్య నుంచి రాలిపోతున్నాయి. తల్లి గర్భం లోపల బిడ్డ రూపొందుతున్నట్లు కొయ్య లోపల బొమ్మ ఆకారం నిర్మితమౌతావుంది.

మునిస్వామి ఒక వైద్యుడిలా కష్టపడతా వుంటే కొయ్య 'తల్లి'లా ప్రసవవేదన పడ్తా వుంది ఉలి దెబ్బలతో. ఇది కూడా ఒక పెనుగులాట.

కొయ్య లోపల్నుంచి బొమ్మని వెలికి తీయడం ఒక సాహసకళ.

"ఏం మునిస్వామి.. దీనెమ్మ.. వూర్లో ఎవనికి పనిలేకపోయినా నీకుమాత్రం పని దొరుకుతాది. అదీ చిన్నాచితకా పని గూడా కాదు. పాతికవేలు దాటితేనే బొమ్మ ఒప్పుకుంటావు. ఈ శెట్టిగుంటకి నువ్వే మొగోడివి" బీడీ ముట్టించి నోటికొచ్చిందేదో బయట్నుంచే వాగుతా లోపలికి వచ్చినాడు సూరయ్య.

సూరయ్యను పల్లెలో అందరూ పెద్దయ్య అని కూడా పిల్చుకుంటారు. ఒకప్పుడు బొమ్మలు పని చేస్తా బాగా సంపాదించే బతికినోడు. కాలం చెడింది. కొడుకు నాగరాజు చేతికందినట్లే అంది కాలంలో కల్సిపోయినాడు. యూనివర్సిటీలో ఎవరో కులం కాని పిల్లను ప్రేమించినాడు. వాళ్ళింట్లో అమ్మాయి తండ్రి వీళ్ళ పెళ్లి చేయడానికి ఒప్పుకోలేదు. ఇంగేం చేస్తాడు? హాస్టల్‌లోనే తెల్లారుజామున ఫ్యానుకు ఉరిపోసుకుని చనిపోయినాడు. నాగరాజుకు కూడా కొయ్యబొమ్మల పని బాగా నేర్పినాడు సూరయ్య. ఒక్కగానొక్క కొడుకు అర్ధాంతరంగా రాలిపోవడంతో సూరయ్య మానసిక పరిస్థితి విషమించింది.

నోటికొచ్చింది మాట్లాడుకుంటూ, కన్పించిన వారి దగ్గర బీడీలు, చిల్లర యిప్పించుకుంటూ జీవితం గడిపేస్తున్నాడు. భూమి, ఇల్లు అమ్మి భార్య లక్షుమ్మ ఇద్దరి కూతుళ్లకు పెళ్లి చేసింది. సాధ్యమైనంత వరకు సూరయ్యను ఇంట్లోంచి బయటకు పంపదు. వారానికో, రెండువారాలకో వస్తాడు. వెనుకనే లక్షుమ్మ వచ్చి తీసుకెళ్తుంది.

"ఏముమందిలే పెద్దయ్య! వూర్లో నీకంటే మొగోడు ఎవడుండాడు?

మీసం దువ్వుకొని బతకాలని వూకు నేర్పింది నువ్వే కదూ. రా.. రా.. కూర్చో" నవ్వుతూ పలకరించినాడు మునిస్వామి ఉలి ఆడిస్తానే.

"సర్లే..సర్లే.. రెండ్రుపాయలు చిల్లరియ్యి. గుట్కా కొనుక్కోవాల" వసారాలో గోడకు ఆనుకున్నాడు సూరయ్య.

"ఇస్తాలేగానీ..ఒక మంచి పాట ఎత్తుకో" అడిగినాడు మునిస్వామి. సూరయ్య కంఠం వినాలనే కోరికతో.

"కూసి గోపురంమింద కురిసె వరసములూ
కురిసేనూ తిరుపతిలో కుంభ వరసములూ
కుంటాలు కుంటాలు రెండు కుంటాలు
ఓటుకుంటా ఒకటి వైకుంఠమొకటి
బాటాలు బాటాలు రెండు బాటాలు
కాశీకి ఒక బాట - తిరుమలకొక బాట
కారములు కారములు రెండు కారములు
ఉప్పుకారమొకటి ఉపకారమొకటి..."


ఎత్తుకున్నాడు సూరయ్య పాట వొకటి... వెంటనే ఊయల్లో పాపను ఊపుతున్న బంగారమ్మ కూడా పడి పడి నవ్వుతా వుంది.

జేబులోంచి పది నోటు తీసి "ఇదో.. పెద్దయ్య" అని అందించినాడు మునిస్వామి.

బంగారమ్మ నవ్వుతానే వుంది. ఆ తర్వాత పాట గుర్తు రాకపోయినా సూరయ్య కీలు గొంతు విన్పిస్తానే ఉంది...ఏదో రాగంతో, ఇంతలో లక్షుమ్మ వచ్చింది. సూరయ్య భుజం పట్టుకొని తీసుకెళ్లబోయింది.

"రోంతసేపు వుండనీలేమ్మా.. ఏమైతాది?" అన్నాడు మునిస్వామి.

"వద్దులే నాయనా. బాగుండేంతసేపు బాగుంటాడు. తటిక్కిన ఏది చేతిలో వుంటే దాంతో విసిరేస్తాడు. ఆరోగ్యం బాలేదుగానీ" బాధగా చెప్పి పిలుచుకొని పోయింది లక్షుమ్మ. కొయ్యబొమ్మలా సూరయ్య వెళ్లిపోయాడు.



మునిస్వామి చేతిలోని ఉలి శిల్పాన్ని చెక్కుకుంటాపోతావుంది... అవిశ్రాంతంగా.

వూర్లోకి జీపొచ్చింది.

ఉలి చప్పుళ్లు ఆగిపోయాయి.

ఎక్కడి బొమ్మల పని అక్కడే నిలిచిపోయింది.

క్షణాల్లో ఆ బొమ్మలకు సంచులు కప్పి దాచేశారు.

భయం..భయంగా.. చూస్తున్నారు.. బిక్కుబిక్కుమంటూ. కానీ వచ్చింది ఫారెస్టోళ్ల జీపు కాదు.

'హస్తకళల ఉత్పత్తుల సంస్థ' అనేది తిరుపతిలో ఒకటుంది. దాని తాలూకు జీపు అది.

'హమ్మయ్య' అని వూపిరి పీల్చుకున్నారు అందరూ.

గ్రామ సచివాలయంలో మీటింగ్ పెట్టారు.

"ముఖ్యమంత్రి కార్యాలయంన్నుంచి ఫోన్ వచ్చింది. మంచి బొమ్మ కావాలి. అమెరికా అధ్యక్షుడి పర్యటన వచ్చేవారంలో హైద్రాబాదులో వుంది. మన రాష్ట్ర గౌరవాన్ని ప్రతిబింబించేలా మంచి కానుక ఇవ్వాలని నిర్ణయించారట. అందుకు మీరందరూ సహకరించి చక్కటి బొమ్మను చేయించి ఇవ్వాలి" పొట్టపైకొచ్చిన బెల్ట్‌ను సరిచేసుకుంటూ చెప్పాడు అధికారి.

## అందమైన ఆయేషా!

*బాలీవుడ్ భామ ఆయేషా టకియా మామూలుగానే కాస్త బొద్దుగా వుంటుంది. ఈమధ్య మరింత లావైంది కూడా. అందుకనే ఆమె లైపోసక్షన్ ద్వారా కాస్మెటిక్ సర్జరీ చేయించుకుంటోంది అనే వార్తలు గుప్పుమన్నాయి. ఇందుకు ఆయేషా వెంటనే స్పందించింది. 'నేను ఎలాంటి సర్జరీలు చేయించుకోలేదు. చేయించుకోను. దేవుడిచ్చిన అందాన్ని కత్తిగాట్లు పెట్టుకుని పాడుచేసుకోవడం ఎందుకు? అయినా నేను మరీ అంతగా లావుకాలేదు. కొంచెం డైటింగ్ గట్రా చేసేస్తే నాజూకుగా తయారవుతాను' అని తేల్చి చెప్పేసింది.*

కళాకారులు ఎవ్వరూ మాట్లాడలేదు. నిశ్శబ్దంగా ఒకరి ముఖాలు ఒకరు చూసుకున్నారు. గతం గుర్తుకొస్తొంది... మంత్రులొస్తున్నారని చెప్పి, కలెక్టర్ అడిగాడని, ఎస్పీ చూడాలని అన్నాడని తాము నెలలు నెలలు కష్టపడి చెక్కిన బొమ్మల్ని తీసుకెళ్ళే అధికారులు డబ్బుల విషయానికి వచ్చేసరికి కన్పించరని కళాకారులందరికి తెల్సిపోయింది.

అధికారులను కాదంటే ఏమైనా హాని తలపెడతారేమోనని భయం కూడా వారి కళ్ళల్లో కన్పిస్తావుంది.

"సరే..సరే.. మీ బాధ అర్థమైంది. కొయ్యబొమ్మకు కావలసిన డబ్బు ఏర్పాట్లు మేం చేస్తాం. మీరు మంచి బొమ్మ సిద్ధం చేయండి. సిఎం దగ్గరికి.. మీ కళాకారుల తరపున ఇద్దరిని కలవడానికి కూడా అవకాశం ఇప్పిస్తున్నాం" అని కళ్ళద్దాలు సరిచేసుకుంటూ ఆ అధికారి చెప్పాడు.

కొంత సంతృప్తిగానే తోచింది కళాకారులందరికీ!

ఇప్పటికిప్పుడు కొయ్యబొమ్మ కావాలంటే ఎలా?

"దశావతారాల బొమ్మ కృష్ణయ్య దగ్గరుంది" ఎవరో అన్నారు. దాన్ని అక్కడికి తెప్పించారు. చూడముచ్చడగా తీర్చిదిద్దబడి వుంది. అధికారులు అందరూ ప్రశంసించారు. అడ్వాన్సుగా మూడువేలు ఇచ్చారు.

ఇరవైవేలు విలువ చేసే కొయ్యబొమ్మ అది. 'మిగిలింది పర్యటనలోనే ఇస్తామని' స్పష్టమైన హామీ ఇచ్చారు.

మునిస్వామి, కృష్ణయ్యలిద్దరికీ ముఖ్యమంత్రిని కలవడానికి అవకాశం కల్పిస్తామని కూడా చెప్పారు.

ఆ తర్వాత రెండు మూడు రోజుల్లోనే ఏర్పాట్లు అన్నీ చకచక జరిగిపోయాయి.

హైద్రాబాదు పర్యటన ఖరారైనప్పటి నుంచి కళాకారులందరూ కూర్చొని ఏవేవో ఆలోచనలు చేస్తూనే వున్నారు.

'ఎర్ర చందనాన్ని ప్రభుత్వం కొని పేద కళాకారులకు అప్పు రూపంలో కొయ్యను అందజేస్తే బాగుంటుందని' తీర్మానించారు. ఈ మాటే అర్జీ కూడా రాసుకున్నారు. ముఖ్యమంత్రిని కిలిసనప్పుడు ఇవ్వడానికి వీలుగా, దశావతారాల బొమ్మతో ప్రభుత్వ వాహనంలో హైద్రాబాదుకు బయలుదేరారు.

అమెరికా అధ్యక్షుడు పాల్గొనే కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. సాయంత్రం జరిగిన ఒక సమావేశంలో ఆయన్ను సన్మానించి శెట్టిగుంట శిల్ప కళాకారులు రూపొందించిన దశావతారాల శిల్పాన్ని ముఖ్యమంత్రి వారికి అందజేశాడు. ఆయన దాన్ని స్వీకరించి వెనక వున్న సెక్యూరిటీకి నిముషాల్లోనే అందజేశాడు. అంతే.. వారి ఖల గురించి ఎవరూ రెండు ముక్కలైనా మట్లాడుకున్నదిగానీ, ప్రశంసించిందిగానీ ఏమీ లేదు. సభ ముగిసింది. మునిస్వామిని, కృష్ణయ్యని ఆ రాత్రి పట్టించుకున్న వాళ్ళు ఎవ్వరూ లేరు. ఎవరి పని వారికి. జేబులోని డబ్బు ఖర్చు పెట్టుకొని తిరుగు ప్రయాణంతో శెట్టిపల్లె చేరుకున్నారు.

'బుద్ధి వచ్చింది. ఇంకెప్పుడూ ఆ సభలకు వెళ్లకూడదు. మనల్ని ఎవడు పట్టించుకుంటారు?" అంటూ మునిస్వామి నిరాశపడ్డాడు.

కృష్ణయ్య అయితే తిరుపతికి.. రావలసిన మిగిలిన సొమ్ముకోసం ఏ ఇరవైసార్లు తిరిగాడో. ఇంకో ఐదువేలు చేతిలోపెట్టి ఈసారి బడ్జెట్ మంజూరైన తర్వాత డిపార్ట్‌మెంట్ నుంచే చెక్ పంపిస్తామని చెప్పారు. కానీ వాళ్ళు పంపుతారనే నమ్మకం లేక కృష్ణయ్య లబోదిబోమని తల్లడిల్లాడు.

"నేను మూడు నెలలు కష్టపడి ఆ దశావతారాల బొమ్మ తయారు చేస్తిని, ఈ కొడుకులు నన్ను నాశనం జేసినారు" అనుకొంటా కొయ్య పనికి కావలసిన కొరముట్లు అన్ని అటకపైకి మూటగట్టి వేసినాడు. టౌన్లోని బట్టలషాపులో పనికి జేరినాడు.

ooo

రోజులు గడుస్తా వుండాయి.

ఓ నడిరాత్రి పూట శ్వాస ఆడక ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు మునిస్వామి.

భార్య బంగారమ్మ ఆందోళనపడ్తా త్వరత్వరగా మంచినీళ్ళు తెచ్చిచ్చింది.

ఆరుబయట వేపచెట్టు అరుగుమీదికి తీసుకొచ్చి కూర్చోబెట్టింది. చల్లటిగాలి వీస్తోంది. పరిస్థితి కొంత ఊరటగా వుంది.

తెల్లారింతర్వాత టౌన్లోని డాక్టర్‌ని కలిశాడు మునిస్వామి.

"పెద్ద ప్రమాదం ఏమీ లేదు. కాకపోతే ముక్కు లోపల వాహిక దగ్గర కండ కొంత పెరిగింది. ఆపరేషన్ చేసి తీసేస్తే సరిపోతుంది" చెప్పాడు డాక్టర్ పరీక్షించి.

'ఆపరేషన్'అనే మాట వినగానే చమటలు పట్టాయి.

"ఇబ్బందేం లేదు. ఈ మాత్రలు వాడు. నిదానంగానే ఆపరేషన్ చేద్దాం" అన్నాడు డాక్టర్ పరిస్థితిని గమనించి.

అక్కడ్నుంచి వచ్చాడేగానీ మనసు మనసులో లేదు. ఈ విషయం భార్య బంగారమ్మకు కూడా చెప్పలేదు. ఆపరేషన్ అంటే డబ్బుతో పని. ఇప్పటికిప్పుడు డబ్బు అంటే తన స్థితికి కష్టం. ఒప్పుకున్న కొయ్యబొమ్మ పూర్తయితే మద్రాసు వ్యాపారి డబ్బులిస్తాడు. అన్నీ పరిష్కారమౌతాయని అనుకున్నాడు మునిస్వామి.

ఆరోజు నుంచి పని వేగం మరింత పెంచాడు. మొండిది.. ఎర్రచందనం కొయ్య.. అందుకే దాన్ని ఉక్కు కొయ్య అని కూడా పిలుస్తారు. శిల్పరీతికి దాన్ని మల్చుకోవాలంటే ఓర్పు, నేర్పు కావాలి.

ఇట్నే త్వరత్వరగా బొమ్మ పూర్తి



## భర్త కోసం

*ఐశ్వర్యారాయ్ తన పర్సనాలిటీ గురించిన శ్రద్ధే కాదు, భర్త అభిషేక్ గురించి కూడా తెగ ఇంటరెస్ట్ చూపిస్తుందిట. ఈమధ్య అభిషేక్ కాస్త బరువు పెరిగాడని చాలా స్ట్రిక్ట్ డైటింగ్‌ని ఫాలో అవుతోందిట. చాకొలెట్‌లంటే తెగ ఇష్టపడే అభిషేక్ అతన్ని ఎలాంటి చాకొలెట్‌నీ ముట్టుకోనివ్వడంలేదట. అంతేకాదు, మొలకెత్తిన విత్తనాల్లాంటి వాటినే పుడ్డుగా తినమని పోరుతోందిట. దీనికి అభిషేక్ ఏమాత్రం కోపం తెచ్చుకోకుండా భార్య చెప్పినట్టే చేస్తున్నాట్ట. అంతే కదా మరి!*

చేయానుకొని సిద్ధపడి గోడు గోడున కన్నీళ్లు పెట్టుకున్న రమణయ్య గుర్తొచ్చినాడు.

పెద్ద సైజులో శిల్పం.. తిరుమల వెంకటేశ్వరస్వామి నిలువెత్తు విగ్రహాన్ని తయారు చేస్తానని బెంగుళూరుకు చెందిన వ్యాపారులతో రమణయ్య ఒప్పందం చేసుకు న్నాడు. ఇరవై అయిదు వేలకు మాట్లాడుకున్నారు. పని మొదలైంది.

వాళ్లక్కడ ఏదో పూజా కార్యక్రమం పెట్టుకున్నారుట. త్వరత్వరగా పూర్తి చేసి ఇవ్వాలని ఒకటే గొడవ. ఫోన్ల మీద ఫోన్లు కొట్టడం, మనుషుల మీద మనుషుల్ని పంపడం. రమణయ్యకు కాళ్ళు చేతులు ఆడలేదు. రాత్రి పగలూ కష్టపడి శిల్పాన్ని తయారు చేశాడు. వాళ్ళు బొమ్మను తీసుకెళ్ళడానికి వాహనాన్ని కూడా తెచ్చి ఇంటి ముందు పెట్టారు.

బొమ్మకు పాలిషింగ్ జరుగుతోంది. వాళ్ళు ఒకవైపు తొందరపెడ్తా వుండారు. తెల్లారితే వాళ్ళ పూజాకార్యక్రమమని చెప్తున్నారు. రాత్రి ముగ్గురు మనుషుల్ని పెట్టి పాలిషింగ్ చేయిస్తున్నాడు రమణయ్య...

చివరికి...

జరగకూడనిదే జరిగింది.

వెంకటేశ్వరస్వామి ముక్కుకు పాలిషింగ్ చేస్తున్నప్పుడు ఉలిమోటు తగిలింది. అంతే. ముక్కులేని వెంకటేశ్వరుడి ప్రతిమ మిగిలింది!

ఇంక ఆ బొమ్మ ఎందుకు పనికొస్తుంది?

వాళ్ళు తిట్టుకుంటూ వెళ్ళిపోయారు, డబ్బులు వెనక్కి తీసుకొని. రమణయ్య కుప్పకూలిపోయాడు కన్నీళ్ళతో. ఈ సంఘటన శెట్టిగుంటలోని కళాకారులందరికీ ఒక గుణపాఠంగా గుర్తిండిపోయింది. గతం గుర్తొచ్చి మునిస్వామి పని వేగం కొంత తగ్గింది. ఉలి చీల్చుకపోతోంది. కొయ్య కొత్త రూపాన్ని ధరిస్తోంది. శ్రద్ధగా..తీక్షణంగా.. వినాయకుడి విగ్రహం నిర్మితమౌతావుంది.

తన చుట్టూ ఏం జరుగుతుంతో కూడా పట్టించుకునే స్థితిలో లేడు మునిస్వామి.

ఎవరో కొత్త మనషులు నలుగురు లోపలికి వచ్చారు. కొయ్య బొమ్మ తయారవుతూ వుంది.

తలపైకెత్తి చూశాడు మునిస్వామి. వాళ్ళనెప్పుడూ, ఎక్కడా చూసింది లేదు.

"బొమ్మలు కావాలా" అడిగాడు ఉలి ఆడిస్తానే.

"కాదు.. నువ్వే" చెప్పాడు ఎత్తుటి మనిషి.

ఆ తర్వాత తెలిసింది. ఫారెస్టోళ్ళు ఊరి బయట జీపు ఉంచి పొలాల మీదుగా నడుచుకుంటూ వచ్చారని వూర్లోకి.

ఆ సమయంలో కొయ్యబొమ్మ చేస్తా పట్టుబడింది మునిస్వామి మాత్రమే. సగం పూర్తయిన బొమ్మతోపాటుగా జీపు ఎక్కాడు.

ఎర్ర చందనం కొయ్య ఎలా వచ్చిందో చెప్పమని అడిగారు.

మౌనం.

'బొమ్మకు అడ్వాన్సు ఎంత తీసుకున్నావు?'

మౌనం..

'ఇప్పటివరకు ఎంత సంపాదించి వుంటావు?'

మౌనం..

మట్టిరోడ్లో దుమ్ము రేపుతా వుంది.. జీపు.

దుమ్ము.. ఎర్రటి దుమ్ము.. కుమ్ముకుంటా వుంది.

మునిస్వామికి ఊపిరాడ్డంలేదు.

సన్నటి దగ్గు కూడా మొదలైంది.

టౌనుకెళ్లాక తెల్సింది ఫారెస్టు డిపార్‌మెంట్‌కు కొత్త ఎస్సై వచ్చాడని.

వార్నింగ్ ఇవ్వడం కోసం ఇలా తమ వూర్లోకి వచ్చారని.

మునిస్వామికి రెండ్రోజుల లాకప్ జీవితం తప్ప లేదు. తనతోపాటూ సగం పూర్తయిన గణపతి విగ్రహం కూడా జైల్లోనే శిక్షను అనుభవించింది.

ఆ తర్వాత.. ఎస్సై అన్న మాటలు. దొమ్మరి ఆట ఆడుకొమ్మని ఇచ్చిన సలహా..

స్టేషన్ నుంచి మునిస్వామి బయటికొచ్చాడు.

కసి.. బాధ.. ఏం చెయ్యాలి?

వూరికి బయలుదేరాడు టౌన్నుంచి!

"ఏమైంది?" ఆత్రమాత్రంగా అడిగింది భార్య బంగారమ్మ.

"కొయ్య బొమ్మ యాడుంది?" మళ్ళీ ఆమే.

వేటికి సమాధానమివ్వలేదు మునిస్వామి. మౌనంగా కూర్చుండిపోయాడు.

ఎదురుగా కొరముట్లు.. ఉలి, రంపం, బాడిశ.. ఏం చేయాలి?

భయం భయంగా ఈ కొయ్యబొమ్మల పని చెయ్యడమా? మానడమా?

ఏదో నిర్ణయానికి వచ్చినవాడిలా పైకి లేచాడు. సంచికి సామాన్లు సర్దుతున్నాడు.

"ఎక్కడికి? ఎందుకు సామాన్లు సర్దుతున్నారు?" ఆమె కలవరపడ్తా ప్రశ్నిస్తోంది.

"వద్దు! మనం ఈ కొయ్యబొమ్మల పనిని నమ్ముకొని బతకలేం. టౌనుకి పోదాం. వెతికితే ఇంతకంటే మంచి పని ఏదో ఒకటి దొరుకుతుంది. సామాన్లు సర్దు" నిశ్చలమైన స్వరం.

కొయ్యబొమ్మలు.. ప్రాణమున్న కొయ్యబొమ్మలు.. బతకడానికి నమ్ముకున్న కళను విడిచిపెట్టి కడుపు చేత పట్టుకొని టౌనుకు తరలిపోతున్న కొయ్యబొమ్మలు.

## మరోసారి డబుల్ రోల్

*దీపికా పదుకొనే తన తొలిచిత్రం 'ఓం శాంతి ఓం'లోనే ద్విపాత్రాభినయం చేసింది. ఆ సినిమా సూపర్ హిట్టయింది. మళ్లీ మరో సినిమాలో డబుల్ రోల్ చేస్తోంది దీపిక. 'చాందినీ చౌక్ టు చైనా' అనే సినిమాలో దీపిక రెండు పాత్రల్ని పోషిస్తోంది. ద్విపాత్రాభినయం ఆమెకి కలిసొచ్చిందనే సెంటిమెంటు ఆమెలోనూ, నిర్మాతా దర్శకుల్లోనూ కలిగిందీ అంటే ఇలా డబుల్ రోల్ సినిమాలు ఆమెతో వరసగా వచ్చినా ఆశ్చర్యం లేదు.*

